క్లుప్తంగా

సినారేకు నివాళి



నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

పలమనేరు: తెలుగుజాతి ముద్దుబిడ్డ, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి జయంతిని స్థానిక కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు, పుష్ప, ఉమాదేవి, శంకర్‌రెడ్డి, సీతారామయ్య, సుదర్శనాచారి, గురుమూర్తి పాల్గొన్నారు.

పాముకాటుకు వ్యక్తి మృతి



మోహన్‌రాజా(ఫైల్)

సదుం: పాముకాటుతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో జరిగింది. భట్టువారిపల్లెకు చెందిన మోహన్‌రాజా(50) తిరుపతిలో నివాసం ఉంటూ, టీటీడీలో అవుట్‌సోర్సింగ్ సెక్యూరిటీ సిబ్బందిగా పనిచేస్తున్నారు. స్వగ్రామానికి వచ్చిన ఆయన శనివారం ఉదయం పొలానికి వెళ్లాడు. అక్కడ పాముకాటుకు గురై కుప్పకూలాడు. గుర్తించిన చుట్టుపక్కల వారు వెంటనే అతన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

సర్వే రాళ్ల ఏర్పాటు



పూజలు చేస్తున్న నేతలు

సదుం: మండలంలోని బూరగమంద రెవెన్యూ విలేజ్ పరిధిలో జగనన్న భూసురక్ష పథకంలో భాగంగా భూహద్దులు నిర్ణయిస్తూ సర్వే రాళ్ల ఏర్పాటు చేస్తున్నట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు శనివారం పూజలు నిర్వహించి ప్రారంభోత్సవం చేశారు. భూసురక్ష పథకంతో వివాదాలు తొలగనున్నట్లు చెప్పారు. సర్పంచ్‌లు వెంకటరమణ, జగన్నాథం, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, నేతలు వెంకటరెడ్డి, దామోదరరెడ్డి, సర్వేయర్ ప్రసాద్ పాల్గొన్నారు.

రేపటి నుంచి సామాజిక తనిఖీలు

కుప్పం: మండల పరిధిలో ఉపాధి పనులపై సోమవారం నుంచి సామాజిక తనఖీలు చేపడుతున్నట్లు ఎస్‌ఆర్‌పీ మీరావళి తెలిపారు. శనివారం సామాజిక తనిఖీ బృందాలతో ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. 2022–203 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులు, పంచాయతీరాజ్, సర్వశిక్ష అభియాన్ ద్వారా జరిగిన పనులపై తనఖీలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. 12 బృందాలో 1,660 పనుల పర్యవేక్షణ అనంతరం బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శ్రీకృష్ణదేవరాయలకు నివాళి



విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైతన్య

పలమనేరు: పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి స్థానిక బాస్(బలిజ అభ్యుదయసేవాసంఘం) నాయకులు శనివారం పూలమాల వేసి నివాళులర్పించి పూజలు చేశారు. ఇక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేసి 164 రోజులు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దివంగత మాజీ పార్లమెంటు సభ్యుడు డీకే ఆదికేశవులునాయుడు మనుమరాలు డీకే చైతన్య, మాజీ డీసీసీ అధ్యక్షుడు సుధాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ కిరణ్, బాస్ నేతలు పగడాల ప్రవీణ్, రఘునాథ్, రవి, జనార్దన్, శంకర్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో ప్రథమ స్థానం

సదుం: జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణలో సదుం మండలం జిల్లాలో ప్రథమ స్థానం సాధించినట్టు జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి శనివారం తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, అధికారుల సహకారంతో ఈ ఘనత సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

సూర్యుని చుట్టూ వలయం



కుప్పం: ఆకాశంలో సూర్యుని చుట్టూ వలయాకారం కుప్పంలో శనివారం కనిపించింది. శనివారం శ్రావణ అధిక మాసం ఏకాదశి పర్వదినం రోజున మధ్యాహ్నం సూర్యుని చుట్టూ వలయాకారం కన్పించింది. ప్రసన్న తిమ్మరాయస్వామి దేవాలయంలో అభిషేకం నిర్వహిస్తుండగా ఇలాంటి దృశ్యం ఆకాశంలో కన్పించడం దైవ సంకల్పంగా భావించి భక్తులు పూజలు చేశారు. ఆకాశంలో సూర్యుని చుట్టూ వలయాన్ని ప్రజలు ఆశక్తిగా తిలకించారు.

నాలుగేళ్లలో మూడు దశాబ్దాల అభివృద్ధి

- గ్రామాలకు రోడ్లు, నీటి ట్యాంకులు
- అభివృద్ధిలో పుంగనూరు ఆదర్శం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరులో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: ముప్పై ఏళ్లుగా ఒకే కుటుంబం పాలన చేసి ఎలాంటి అభివృద్ధి చేపట్టకపోవడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో వందల కోట్లు ఖర్చు చేసి మూడు దశాబ్దాల అభివృద్ధి సాధించి ఆదర్శంగా నిలిచామని రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం చిత్తూరు ఎంపీ రెడ్డెప్పతో కలిసి పుంగనూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పుంగనూరు నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురైందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పట్టణానికి బైపాస్‌రోడ్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే రూ.50 కోట్లతో ఎంబీటీ రోడ్డును విస్తరించే కార్యక్రమం చేపట్టామన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య తీర్చేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి రూ.12 కోట్లతో 25 కిలోమీటర్ల మేర పైప్‌లైన్లు, ఫిల్టర్‌హౌస్‌లు, ట్యాంకులు నిర్మించే కార్యక్రమాలు చేపట్టామన్నారు. రూ.2 కోట్లతో పుంగమ్మ చెరువు కట్టపై పార్కు, వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేసే పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో స్థానిక ప్రభుత్వాస్పత్రిని వంద పడకల ఏరియా ఆస్పత్రిగా మార్పు చేశామన్నారు. ఇందు కోసం ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి సొంత నిధులు కోటి రూపాయలతో ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు చేశామని చెప్పారు. సదుంలో 30 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేసి, 11 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా జరగని అభివృద్ధి కార్యక్రమాలను పుంగనూరు నియోజకవర్గంలో చేపట్టి, ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామన్నారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ..

నియోజకవర్గంలోని అన్ని మండలాలకు విద్యుత్ సమస్య లేకుండా రూ.1,600 కోట్లతో సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్రామానికి సిమెంట్ రోడ్లు, కాలువులు, ఓవర్‌హెడ్ ట్యాంకులను ఏర్పాటు చేసి పైప్‌లైన్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నామన్నారు. వీటితో పాటు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. సరిహద్దు గ్రామాలను అనుసంధానం చేస్తూ లింకు రోడ్లు ఏర్పాటు చేశామన్నారు.

ప్రారంభోత్సవాలు...

మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మున్సిపాలిటీలో శనివారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. రామకృష్ణనగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన రోడ్డు పనులను ప్రారంభించారు. అలాగే చంద్రకాంత్‌వీధిలో రూ.10 లక్షలతో వేయనున్న రోడ్డు పనులను ప్రారంభించారు. రహమత్‌నగర్‌లో రూ.8 లక్షలతో వేయనున్న రోడ్డు పనులను మంత్రి ప్రారంభించారు. నానబాలవీధిలో రూ.14 లక్షలతో నిర్మించిన కాలువ పనులను ప్రారంభించారు.

> **నేడు వార్డు బాట ..**
>
> మంత్రి పెద్దిరెడ్డి ఆదివారం వార్డుబాట కార్యక్రమాన్ని చెంగలాపురం అబుబకర్ మసీదు ఏరియా, రహమత్‌నగర్, కృష్ణాపురం, చాడేపల్లి రోడ్డు, మేలుపట్ల, సూర్య నగర్, కొత్తపేట ప్రాంతాల్లో నిర్వహిస్తారని మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా తెలిపారు.



పుంగనూరులో వార్డుబాటలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి



పుంగనూరులో వృద్ధురాలి సమస్య వింటున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వార్డు బాట ఇలా....

మంత్రి పెద్దిరెడ్డి వార్డుబాటను తోపుమఠం, గాంధీనగర్, నేతాజి, ఎంబీటీ రోడ్డు, యూబికాంపౌండ్, గోకుల్‌వీధి, తూర్పుపాళెంలో నిర్వహించారు. ప్రజలు మంత్రికి నీరాజనం పలికారు. మంత్రి ప్రజలకు అభివాదం చేస్తూ, వారి వినతిపత్రాలు స్వీకరించి, సమస్యలు పరిష్కరించారు.

మున్సిపల్ మీట్ రేపు

పలమనేరు: పలమనేరు మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 12 గంటలకు నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎక్స్‌అఫిషియో సభ్యులు తప్పక హాజరు కావాలని సూచించారు. ఇందులో పలు తీర్మానాలను కౌన్సిల్ ఆమోదానికి ఉంచనున్నట్టు అందులో పేర్కొన్నారు.

ఘనంగా ద్వాదశి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పలమనేరు: మన్నారునాయునిపల్లిలో వెలసిన నిర్వాణ నారాయణస్వామికి ద్వాదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాన్ని భక్తులు నిర్వహించారు. పరిమళ ద్రవ్యాలతో విగ్రహాన్ని అభిషేకించి ఆపై అలంకరణలు చేసి మంగళహారతులతో స్వామివారిని దర్శించుకున్నారు.

సంక్షేమంతో సామాజికాభివృద్ధి



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: సంక్షేమ పథకాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును అందిపుచ్చుకుని రాష్ట్రంలోని ప్రతి కుటుంబం అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శనివారం రాళ్లబూదుగూరులో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా ఉన్న ప్రభుత్వ పథకాలను విమర్శిస్తున్న వారు అధికారంలోకి వస్తే మళ్లీ ఆ పార్టీల వారి జేబులు మాత్రమే నింపుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 35 ఏళ్లుగా కుప్పాన్ని నిర్లక్ష్యం చేసిన చంద్రబాబుకు, ప్రతి కుటుంబానికి మేలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న తేడాను ప్రజలు గమనించాలని కోరారు. జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి, ఎంపీడీఓ హేమమాలిని, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు రమేష్, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు చెంగప్ప, కృష్ణమూర్తి, సుకుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు నిసార్ పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్ట్

రామకుప్పం: ఏడుగురు పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని గడ్డూరు, చిన్న గెరిగపల్లి సమీపంలోని పొలంలో పేకాట శిబిరంపై శనివారం రామకుప్పం ఎస్‌ఐ శ్రీనివాస్ దాడి చేశారు. దాడిలో పేకాటాడుతున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8,420 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదనపు పోషకాహారం పంపిణీ



పోషకాహారం పంపిణీ చేస్తున్న దాత

సదుం: మండలంలోని క్షయ వ్యాధిగ్రస్తులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం అదనపు పోషకాహారం పంపిణీ చేశారు. స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో దాత లీలావతి ద్వారా 18 మంది రోగులకు పోషకాహారం అందజేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు రాజారెడ్డి, జయకుమార్‌రెడ్డి, నరసింహులు, హెల్త్ సూపర్‌వైజర్, నీలకంఠ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే జగనన్న లక్ష్యం

- ఎమ్మెల్సీ భరత్



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ చైర్మన్ సుధీర్

కుప్పం: సంక్షేమం, అభివృద్ధే సీఎం జగనన్న లక్ష్యమని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శనివారం కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని 1, 2 వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్లను అందజేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని ఆయన కోరారు. వచ్చే ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తనను గెలిపించాలని ఆయన కోరారు. మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్, కౌన్సిలర్లు జగన్, మునిరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



భట్టువారిపల్లెలో పీర్ల ఊరేగింపు

సదుం: మండలంలోని భట్టువారిపల్లెలో నిర్వాహకుడు మురళి ఆధ్వర్యంలో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీర్లచావడిలో పీర్లను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీర్లను ప్రత్యేక వాహనంలో ఉంచి మేళతాళాలతో ఊరేగించారు. గంధం పంచిపెట్టారు. శుక్రవారం రాత్రి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు.



కృష్ణాపురంలో అగ్నిగుండం వద్ద యువత కేరింతలు

వి.కోటలో..

వి.కోట: మొహర్రం వేడుకలను ముస్లింలు పండుగను శుక్రవారం రాత్రి నుంచి ఘనంగా జరుపుకున్నారు. కృష్ణాపురంలో ముస్లింలు పీర్ల పండగ నిర్వహించారు. ముస్లింలు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పులిచెర్ల(కల్లూరు): పురుగులమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కల్లూరు ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి వివరాల మేరకు ..మండలంలోని చల్లావారిపల్లెకు చెందిన శివకుమార్(31). ఇతను భార్యతో గొడవపడి మే10, 2023న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో భార్య రేఖ భర్త కనబడడం లేదని కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఈక్రమంలో శనివారం అయ్యావాండ్లపల్లె సమీపంలో కుళ్లిపోయిన స్థితిలో శవం, పక్కనే బైక్ ఉండడం స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి, అక్కడ ఉన్న బైక్, వస్తువులను, పురుగులమందు పరిశీలించారు. సంఘటన స్థలంలో దొరికిన వస్తువుల ఆధారంగా చనిపోయిన వ్యక్తి చల్లావారిపల్లెకు చెందిన శివకుమార్‌గా గుర్తించారు. పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఆలయ భూములు కౌలుకు వేలం రేపు

పలమనేరు: కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ భూములు కౌలుకు ఈనెల 31న ఉదయం 9 గంటలకు స్థానిక ఆలయం వద్ద బహిరంగ వేలాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కమలాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో గంగవరంలోని సర్వేనం: 422/8లో 39 సెంట్లు, 451/4లో 82 సెంట్లు, 457లో 2.40 మొత్తం 3.61 ఎకరాల భూమిని మూడేళ్ల కౌలుకు ఇవ్వనున్నట్లు అందులో తెలిపారు. ఇందులో పాల్గొనేవారు రూ.10వేల నగదు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు.

సేంద్రియమే ముద్దు.. పురుగుల మందులొద్దు

- ఫెస్టిసైడ్స్‌లేని పంటల ఉత్పత్తితోనే ఆరోగ్యసమాజం
- రైతులు ప్రకృతి, సేంద్రియ పద్ధతులకు అలవాటు పడాలి
- మార్కెట్, సీజన్‌ను బట్టి పంటలు సాగు చేసుకోవాలి



గంగవరం మండలంలో ఫెస్టిసైడ్స్ మందులతో సాగు చేసిన టమాట



పలమనేరు మండలంలో సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన కీర

పలమనేరు: రసాయనిక ఎరువులతో భూసారాన్ని కోల్పోవడమే కాకుండా పంట దిగుబడులు తగ్గిపోతున్నాయి. అధిక పెట్టుబడుల కారణంగా రైతులకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో ఏ సీజన్‌లో ఏం పంట సాగుచేయాలి, సంప్రదాయపంటలకు బదులు కొత్త పంటల సాగుపై రైతులు దృష్టిపెడుతున్నారు. ముఖ్యంగా పలు రకాల ఉద్యానపంటలు పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో సాగవుతున్నాయి. అయితే ఉద్యాన పంటలకు ఎక్కువగా తెగుళ్లు వస్తుండడంతో క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాల్సి వస్తోంది. అయితే మోతాదు తగ్గిస్తూ రావడంతో పంటలను సాధారణ పరిస్థితికి తీసుకొచ్చి ఆపై సేంద్రియ, సహజ పద్ధతులను అలవాటు చేసుకోవాల్సి ఉంటుందని ఉద్యానశాఖ సూచిస్తోంది.

ఉద్యానపంటల హబ్‌గా పలమనేరు

పలమనేరు హార్టికల్చర్ డివిజన్ ఉద్యాన పంటలకు హబ్‌గా ఉంది. ఇక్కడ 1,18,222 హెక్టార్లలో ఉద్యానపంటలు సాగవుతున్నాయి. ఇందులో 36శాతం మామిడితోటలుగా ఉన్నాయి. మిగిలిన భూముల్లో టమాట, అరటి, బొప్పాయ, బంగాళాదుంప, బీన్స్, తీగజాతి పంటలు, బంతి, చామంతి లాంటి పూలమొక్కలు సాగవుతున్నాయి. ఇక్కడి చల్లటి వాతావరణం, భూముల స్వభావం ఉద్యాన పంటల సాగుకు అనుకూలంగా ఉంటుంది. దేశంలోనే పలమనేరు డివిజన్‌లో టమాట సంవత్సరమంతా సాగవుతుంది. నాణ్యమైన పంటతోబాటు దిగుబడులు బాగున్నాయి. నర్సరీల్లో నారుద్వారా పంటను పెంచడంతో పంటకాలం తగ్గడంతోపాటు అధిక దిగుబడులొస్తున్నాయి. ఇక్కడి రైతులు మల్చింగ్, షేడ్‌నెట్లు, ప్యాక్‌హౌస్‌ల ద్వారా నూతన పద్ధతులతో పంటలను పండిస్తున్నారు.

సంప్రదాయ పంటలకు బదులు కొత్తపంటలు చేద్దాం

జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో మామిడి సాగవుతోంది. ఈ దఫా పంట దిగుబడులు బాగానే వచ్చినా మార్కెట్‌లో ధరల ఒడిదుడుకులతో ఆశించిన ధర రైతుకు లభించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయంగా డ్రాగన్‌ఫ్రూట్, గార్సీనియా, అల్లనేరేడు, పచ్చిబఠాణి, చింత లాంటి పంటలను సాగు చేసుకోవచ్చు. ఇప్పటికే పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో కొత్త పంటలను సాగుచేస్తున్నారు. అదే వాతారణం ఇక్కడ ఉంది కాబట్టి కొత్త పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలి.

> **మార్కెట్‌ను గమనించి పంటలు సాగుచేయాలి...**
>
> 
>
> పలమనేరు ప్రాంతం అటు బెంగళూరు, చెన్నై నగరాలకు మధ్యలో ఉంది. దీనికితోడు కేరళ, కోయంబత్తూరు మంచి మార్కెట్‌ను కలిగి ఉన్నాయి. రైతులు పంట సాగుచేసే ముందు మార్కెట్ స్థితిగతులను గమనించాలి. ఏ సీజన్‌లో ఏపంట వేస్తే ధర బాగుంటుందో ఆలోచించాలి. ముఖ్యంగా రక్షిత సేద్యం చేపట్టాలి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పత్తిని సాగుచేస్తూ కొత్త రకాలను సాగుచేయాలి.
>
> –డా. కోటేశ్వరావు, హార్టికల్చర్ ఏడీ, పలమనేరు

> **పురుగుమందుల మోతాదు తగ్గించాలి...**
>
> 
>
> ప్రస్తుతం పురుగుమందులు లేకుండా పంటలను కాపాడుకోవడం కష్టమే. ఎందుకంటే కొత్త వంగడాల కారణంగా తెగుళ్లు ఎక్కువగానే ఉంటాయి. అయితే డోస్ తగ్గించుకుంటూ వచ్చి ఆపై సేంద్రియ పద్ధతులను అలవాటు చేసుకోవచ్చు. నేను గత నాలుగైదేళ్లుగా పూర్తిగా సేంద్రియ పద్ధతులతోనే పంటలను సాగుచేస్తున్నా. క్రిమిసంహారక మందులను సైతం సొంతంగా తయారు చేసుకుంటున్నా.
>
> –రత్నారెడ్డి, మహిళా రైతు, కొలమాసనపల్లి

రైతు భరోసా కేంద్రాలు



రొంపిచెర్లలోని రైతు భరోసా కేంద్రం

- రైతులకు అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- టమాట కిలో ధర రూ.100, 150
- అప్పటికప్పుడే అందుతున్న పరిహారం
- పంటల సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు



భూసార పరీక్షలపై అవగాహన (ఫైల్)



అవార్డు అందుకుంటున్న వెంకటరమణ (ఫైల్)

రొంపిచెర్ల: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలతో రైతులు అభివృద్ధి చెందుతున్నారు. రొంపిచెర్ల మండలంలో ఎనిమిది గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఎనిమిది రైతు భరోసా కేంద్రాలను రూ.1.60 కోట్లతో నిర్మించారు. రైతులకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులను వీటిలో రైతులకు పంపిణీ చేస్తున్నారు. దీంతో రైతులకు భరోసా కేంద్రాలుగా నిలుస్తున్నాయి. మండలంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు వైఎస్సార్ రైతు భరోసా పథకంలో 22,150 మంది రైతులు, పీఎం కిసాన్ పథకంలో 20,056 మంది రైతులు, సున్నావడ్డీ పంట రుణాలు 1,184 మంది, పంట బీమా పథకంలో 3,396 మంది, ఇన్‌పుట్ సబ్సిడీ కింద 1,923 మంది మొత్తం 48,709 మంది రైతులు లబ్ధిపొందారు.

5,125 క్వింటాళ్ల విత్తనాల పంపిణీ

మండలంలో 10,376 మంది రైతులకు నాలుగేళ్లలో 5,125 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేశారు. వేరుశనగ విత్తనాలు 8,300 మంది రైతులకు 4,771 క్వింటాళ్లు, కంది విత్తనాలు 661 మందికి 26.88 క్వింటాళ్లు, ఉలవలు 995 మందికి 315 క్వింటాళ్లు, రాగులు 412 మందికి 10.8 క్వింటాళ్లు పంపిణీ చేశారు. 2,535 మంది రైతులకు 1022.63 మెట్రిక్ టన్నుల ఎరువులను పంపిణీ చేశారు. 142 మందికి 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు, 14 మందికి స్ప్రింక్లర్లను అందజేశారు. 8 రైతు మిత్ర గ్రూపులకు ఎనిమది ట్రాక్టర్లను పంపిణీ చేశారు.

పంటల సాగులో రైతులు బిజీ

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వ్యవసాయంపై భరోసా కల్పిస్తుండడంతో పంటల సాగుపై దృష్టి సారించారు. ఎప్పుడు సాగు చేయని విధంగా పంటలను సాగుచేస్తున్నారు. ఆర్బీకేలలో లభించే విత్తనాలు, ఎరువులు, రైతుల పంటకు గిట్టుబాటు ధర ఉండడంతో వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారు.

వైఎస్సార్ యాప్‌తో సిబ్బంది పనితీరు పరిశీలన

రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది రైతుల పనితీరును వైఎస్సార్ యాప్ ద్వారా పరిశీలన చేస్తుంది. యాప్‌తో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు సాగు చేసే పంటలను ఈ క్రాప్ చేయడం, పొలంబడి కార్యక్రమాలు, సీసీ ఎక్స్‌పెరిమెంట్స్, క్షేత్రస్థాయి ప్రదర్శనలు, విత్తన ఉత్పత్తి క్షేత్రాలను సందర్శించడం, భూసార పరీక్షల కోసం నమూనాల సేకరణ, పంటల బీమా పథకం, సేంద్రియ ఉత్పత్తుల కోసం రైతులను సిద్ధం చేయడం, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నమోదు చేయడం వంటి కార్యక్రమాలు చేస్తున్నారు. వీటిని ప్రభుత్వ అధికారులు ప్రతినెలా ఆన్‌లైన్‌లో పరిశీలించి గ్రేడింగ్‌లు ఇస్తారు. రైతులకు వ్యవసాయంపై సలహాలు, సూచనలను వ్యవసాయశాఖ అధికారులు ఇస్తున్నారు. ఈక్రమంలోనే రొంపిచెర్ల–2 రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జి వెంకటరమణ నాయక్ రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు.